క్లుప్తంగా

నేడు నీటి సరఫరా నిలిపివేత

దేవరకొండ : కొండమల్లేపల్లి మండల పరిధిలోని బాపూజీ నగర్ వద్ద వాటర్ సంపు వద్ద ఫ్లో మీటర్ ఏర్పాటు చేస్తున్నందున నేడు దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు దేవరకొండ మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

త్రిపురారం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ అనుముల పాండమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అలివేలు మంగమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పూర్తి నివేదికతో హాజరు కావాలని కోరారు.

సమస్య పరిష్కరించకుంటే ప్రగతిభవన్ ముట్టడిస్తాం

మిర్యాలగూడ టౌన్ : ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలను పరిష్కరించకుంటే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. శుక్రవారం స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ కొన్ని రోజులుగా ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలలో జరిగిన నష్టంపై న్యాయం చేయాలని, మంత్రులు, అధికారులను వివిధ రూపాల్లో కలిసి అభ్యర్థించినా పట్టించుకోలేదన్నారు. టీఎస్ఎల్పీఆర్బీ బోర్డు చైర్మన్ ఏక పక్ష నిర్ణయాల వలన అభ్యర్థులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. అభ్యర్థుల అన్యాయానికి కారణమైన చైర్మన్‌ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. అభ్యర్థులకు న్యాయం చేయని పక్షంలో ఈ నెల 9న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

ఆదాయ పన్ను వివరాలు సమర్పించాలి

మిర్యాలగూడ టౌన్ : 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను మిర్యాలగూడ సబ్ ట్రెజరరీ పరిధిలోని పెన్షన్‌దారులు ఫిబ్రవరి 10వ తేదీ వరకు ఆదాయ పన్నుల వివరాలను సంఘం కార్యాలయంలో సమర్పించాలని విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బంటు శేషు, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, హేమగుప్తా, వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డిలు సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఫార్మ్ నమునాలో పెన్షన్‌దారులంతా తమ ఆదాయ వివరాలను తప్పని సరిగా సమర్పించాలని కోరారు.

క్రీడా పోటీలు ప్రారంభం

చింతపల్లి : మండల కేంద్రంలోని అలూకా జైహింద్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు మహాలక్ష్మి మహిళా మండలి ఆధ్వర్యంలో క్లస్టర్ స్థాయి ఆటల పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ భానునాయక్ ప్రారంభించి మాట్లాడారు. రెండు రోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఇన్‌చార్జి కొండానాయక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ నర్సింహా, గీతారాణి, రామస్వామి, వసురాం, హైమావతి, లావణ్య, లింగస్వామి, ప్రభాకర్‌రెడ్డి, సునిత, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీ ఎన్నిక

హాలియా : నాగార్జున సాగర్ నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో అధ్యక్షుడిగా కమ్మంపాటి గురువయ్య, ఉపాధ్యక్షులు నల్లమెట్టి వెంకటరమణ, దారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొట్టె సైదయ్య, కోశాధికారి బండా శ్రీధర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు చవ్వా వెంకట్‌రెడ్డి, గౌరవ సలహాదారు కుక్కడపు రమేశ్‌ని ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో కాశీ, రమణ నాయుడు, హరి, బిక్షపతి, రవితేజ, రాజు, నరేష్, కోటి, సురేష్, శివ, శంకర్, ప్రభాకర్ ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో కోతులను నియంత్రించాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రవీందర్‌సాగర్‌తో పాటు అటవీశాఖ అధికారులకు కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. ఆయా అధికారులకు వినతి పత్రాన్ని అందజేసిన వారిలో కాలనీకి చెందిన అక్బర్, కల్యాణి, శ్రీనివాస్, గోపి, హైమావతి, శేఖర్, స్రుజన, విజయకుమారీ, సుజాత, రేవతి, జగదీష్, కళావతి, దినిష్‌కుమార్, అబిదున్నీసా బేగం, అనూష పాల్గొన్నారు.

బీఎస్పీ మండల కమిటీ ఎన్నిక

డిండి : బహుజన సమాజ్ పార్టీ మండల కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తలతో ఏర్పాటు చేసిన మండల విస్తృత స్థాయి సమావేశానికి దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రమావత్ రమేశ్ నాయక్ నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణ జాంబవ్ హాజరై మాట్లాడారు. నూతన మండలాధ్యక్షుడిగా ఎలిమినేటి వెంకట్ ద్రావీడు, కార్యదర్శి కృష్ణ వంశీ, కోశాధికారి వింజమూరి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పేదల చెంతకు కార్పొరేట్ వైద్యం

● ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల చెంతకు కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం దేవరకొండ ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత డయాలసిస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు కేవలం 3 డయాలసిస్ కేంద్రాలు ఉంటే తెలంగాణ ప్రభుత్వం వాటిని 102కి పెంచిందన్నారు. డయాలసిస్ పేషెంట్లకు బస్‌పాస్‌లు, పింఛన్, జీవితకాలం మందులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్‌ను అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ మాతృనాయక్, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీ నల్ల గాసు జాన్‌యాదవ్, జెడ్పీటీసీ మారుపాకుల అరుణసురేష్‌గౌడ్, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్గౌడ్, వైస్ చైర్మన్ రహత్‌అలీ, శిరందాసు కృష్ణయ్య, సూపరింటెండెంట్ రాములునాయక్, ఆయా వార్డుల కౌన్సిలర్లు వడ్త్య దేవేందర్, జయప్రకాశ్, రయిస్, తౌఫిక్, పాల్గొన్నారు.



డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బీఆర్ఎస్‌లో చేరిక

కొండమల్లేపల్లి మండలానికి చెందిన పలువురు శుక్రవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. చిన్నఅడిశర్లపల్లి బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు, వెంకటేశ్, కాంగ్రెస్ వార్డు సభ్యుడు వెంకటయ్యతో పాటు మరికొంత మంది ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చేరగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు అధ్యక్షుడు లింగారెడ్డి, నాయకులు పస్నూరి యుగేంధర్‌రెడ్డి, రమావత్ దస్రు, రాంబాబునాయక్, కృష్ణయ్య, ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్, జర్నలిస్టు సంఘం నాయకులు

టీయూడబ్ల్యూజే పోస్టర్ ఆవిష్కరణ

ఈనెల 8న హైదరాబాద్‌లో నిర్వహించనున్న టీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే రవీంద్రకుమార్ తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని ఆంజనేయులు, సింగం నారాయణ, సయ్యద్‌పాష, సముద్రాల వేణు, బిజిలి లింగం, రమేష్, శ్రీనివాస్, మణి, శ్రీధర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే సమగ్రాభివృద్ధి

● ఎమ్మెల్యే నోముల భగత్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి

పెద్దవూర : గ్రామాల సమగ్రాభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డిలు అన్నారు. శుక్రవారం మండలంలోని కోమటికుంట తండా, ఊట్లపల్లి, గేమ్యానాయక్‌తండా, పోతునూరు గ్రామాల్లో రూ.20లక్షల చొప్పున సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన, పిన్నవూరలో రూ.20లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లను వారు ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను ప్రవేశపెట్టి సీఎం కేసీఆర్ రైతు బాంధవుడిగా నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చెన్ను అనురాధసుందర్‌రెడ్డి, జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, నాయకులు కర్న బ్రహ్మారెడ్డి, గజ్జెల లింగారెడ్డి, కురాకుల అంతయ్య, సత్యనారాయణరెడ్డి, జటావత్ రవినాయక్, దేవసాని శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌కే బషీర్, మెండె సైదులు, మునిరెడ్డి, సర్పంచ్‌లు కసిరెడ్డి అనితమేఘశ్యాంరెడ్డి, నడ్డి లింగయ్య, శంకర్ నాయక్, పాల్గొన్నారు.



పెద్దవూర : పిన్నవూరలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భగత్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి

9న నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్



హాలియాలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా : దివంగత నేత, మాజీ శాసనసభ్యులు నోముల నర్సింహయ్య జ్ఞాపకార్థం నోముల ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనవరి 9న హాలియా పట్టణంలో నిర్వహించనున్న ప్రీమియర్ లీగ్ నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి క్రికెట్ టోర్నమెంట్ సీజన్‌కు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మ , వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు చెరుపల్లి ముత్యాలు, డైరెక్టర్ సురభి రాంబాబు, యూత్ అధ్యక్షుడు పగడోజు సైదాచారి, నాయకులు సైదులు, ప్రసాద్, సైదులు, ఎల్లయ్య ఉన్నారు.

పెద్దవూర : ఈ నెల 8న హాలియాలో ఎన్ఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివంగత నోముల నర్సింహయ్య 67వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేయనున్న మెగా హెల్త్‌క్యాంపు ప్రచారం కరపత్రాలను శుక్రవారం జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవినాయక్, నాయకులు సత్యనారాయణరెడ్డి, కర్న బ్రహ్మారెడ్డి, ఎస్‌కే బషీర్, దేవసాని శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మమ్మ, అంతయ్య, శ్రీకర్, పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే భాస్కర్‌రావు



ఇందిరమ్మ కాలనీలో బీటీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : పట్టణాభివృద్ధికి తాను ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని 6వ వార్డు ఇందిరమ్మ కాలనీ పరిధిలో ఆర్అండ్‌బీ, మున్సిపల్ శాఖల ద్వారా మంజూరైన రూ.1.50కోట్ల నిధులతో నార్కట్‌పల్లి– అద్దంకి బైపాస్ నుంచి ఇందిరమ్మ కాలనీ ఎస్ఎస్పీ కాల్వ బ్రిడ్జి వరకు కిలోమీటరు మేరా డబుల్ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజిసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర విష్ణు, పీఏసీఎస్ చైర్మన్ వెలిశెట్టి రామకృష్ణ, కౌన్సిలర్ సాధినేని స్రవంతిశ్రీనివాస్, సర్పంచ్ బణావత్ లలితసక్రు, ఆర్అండ్‌బీ డీఈ గణేష్, మున్సిపల్ డీఈ సాయిలక్ష్మీ, నాయకులు షేక్ ఫయాజ్, కుర్ర కృష్ణకాంత్, ఘంటా శ్రవణ్‌రెడ్డి, కొత్త ఆంజనేయులు, ఆర్అండ్‌బీ డీఈ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతోనే ఉద్యోగులకు గుర్తింపు



ఎంపీఓ పద్మను సన్మానిస్తున్న ఎంపీడీఓ, బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): వృత్తి నిబద్ధతతోనే ఉద్యోగులకు సరైన గుర్తింపు లభిస్తుందని మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) ఖాజా అస్గర్‌ఆలీ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా రాష్ట్ర ఉత్తమ అధికారిగా పూలే అవార్డును అందుకున్న మండల ఎంపీఓ సకినాల పద్మను శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యోగులు పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఖాజా అస్గర్‌ఆలీ మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సావిత్రిబాయి పూలే చేసిన కృషి చిరస్మరణీయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్, బీసీ ఉద్యోగుల సంఘం మండల ఇంఛార్జ్ సతీష్, ఆవుల మధు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కట్టెబోయిన సైదయ్య, శివప్రసాద్, వీరయ్య, ఏపీవో నాగేశ్వరావు,బాలాజీ, కరుణాకర్, సబితారెడ్డి, నాగలక్ష్మీ, వరలక్ష్మీ, శ్రీను, మధవి పాల్గొన్నారు.

వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని వినతి

హాలియా : కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం ఏజెన్సీ ఇతర రంగాలను ప్రైవేటుపరం చేయొద్దని, తక్షణమే ఉపసంహరించుకొని రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ఆశ వర్కర్లతో కలిసి నిరసన వ్యక్తం చేసి అనంతరం హాలియా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూపరింటెండెంట్ మోతీలాల్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలపై ఏప్రిల్ 5న జరిగే 'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ రాష్ట్ర నాయకులు ప్రమీల, జిల్లా నాయకులు భూలక్ష్మి, రామేశ్వరీ, పార్వతి, ఇందిరమ్మ, నాగేంద్ర సువర్ణ, నాగరాణి పాల్గొన్నారు.

త్రిపురారం : స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ రాష్ట్ర నాయకులు ప్రమీలా డిమాండ్ చేశారు. మండలంలో ఉన్న ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శంకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వివిధ స్కీంల పరిధిలో ఉన్న వారిని ప్రైవేట్ పరం చేయాలని కేంద్రం చూస్తుందని, తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సైదులు, జిల్లా నాయకులు భూలక్ష్మీ, ప్రేమలత, సీత, రోహిణి, అమీరా, సుజాత, రాణి, రమాదేవి పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశలు, సీఐటీయూ నాయకులు

బాలబాలికలను సమానంగా చూడాలి

మిర్యాలగూడ : తల్లిదండ్రులు తమ పిల్లల్లో బాలబాలికలు అనే వ్యత్యాసాన్ని విడనాడి ఇద్దరికి సమాన అవకాశాలు, సమాన విద్యను అందించాలని ప్రముఖ వైద్యులు జీవనజ్యోతి, సరిత అన్నారు. శుక్రవారం స్థానిక శస్త్ర పాఠశాలలో ధీర సంస్థల గైనకాలజిస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వయోలెన్స్ అగైన్స్ట్ విమెన ప్రోగ్రాంలో పాల్గొని మాట్లాడారు. స్త్రీ, పురుష సమానత్వానికి కుటుంబ వ్యవస్థ భీజమని, కుటుంబం నుంచే సమూలమైన మార్పులు తీసుకొచ్చినప్పుడే లింగ సమానత్వం చోటు చేసుకుని పురోభివృద్ధి చెందతుందన్నారు. స్త్రీలపై శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా ఎలాంటి ప్రలోభాలకు గురిచేసినా అది స్త్రీ హింస కిందికే వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సింధు, కరస్పాండెంట్ శ్రీధర్‌రెడ్డి, ప్రజాసైన్స్ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జ్యోతి

ఏఓను సస్పెండ్ చేయాలని సీఎంకు లేఖ



లేఖను పోస్టు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో అవినీతికి పాల్పడుతున్న ఏఓను సస్పెండ్ చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సీఎం క్యాంపు కార్యాలయానికి స్పీడ్ పోస్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని కాని జిల్లా గిరిజన సంక్షేమ శాక కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న జాఫర్ విద్యా వలంటీర్ల విషయంలో సీనియార్టి పాటించలేదని, జిల్లా వ్యాప్తంగా ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యా వలంటీర్ల నియామకాల్లో డబ్బులు తీసుకుని తన ఇష్టానుసారం నియామకాలు చేపట్టారని ఆరోపించారు. ఏఓ అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టి సస్పెండ్ చేయాలని ఆ స్పీడ్ పోస్టులో కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సైదానాయక్, జగన్ నాయక్, వీరన్న, ఉపెందర్, సమ్మద్ ఉన్నారు.

ఆర్టీసీ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

నిడమనూరు : తెలంగాణ ఆర్టీసీ అందిస్తున్న ప్రయాణ రాయితీలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ డిపో మేనేజర్ పాల్, సీఐ సంధ్యారాణి అన్నారు. నిడమనూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద 'ప్రజల వద్దకు ఆర్‌టీసీ' కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. ఆర్టీసీలో రాయితీలతో కూడిన ప్రయాణంతో పాటు సురక్షితంగా ఉంటుందన్నారు. స్థానికులు మాట్లాడుతూ నల్లగొండకు వెళ్లలంటే బస్సులు సరిపడా లేవని, పక్క మండలంలోని వెళ్లి అక్కడి నుంచి జిల్లా కేంద్రానికి పోవాల్సి వస్తుందని డిపో మేనేజర్ దృష్టికి తీసుకెల్లారు. దీనికి ఆయన స్పందిస్తూ నల్గొండ డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రయాణికులు, యువకులు ఉన్నారు.

తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే



మాట్లాడుతున్న సినీ నటి కవిత

మిర్యాలగూడ : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని బీజేపీ రాష్ట్ర నాయకురాలు, సినీ నటీ కవిత అన్నారు. శుక్రవారం వేములపల్లి మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు చిర్ర సాంబమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రబారి లచ్చిరెడ్డి, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రావు, నియోజకవర్గ కన్వీనర్ రతన్‌సింగ్‌నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల రమేష్, సైదులు, సీతారాంరెడ్డి, కొండేటి సరిత, పెదమాం వెంకన్న నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివి

హాలియా : భారతదేశ ప్రముఖ సంఘ సంస్కకర్తలలో సావిత్రిబాయి పూలే ఒకరని ఆమె మహిళ అభ్యున్నతికి చేసిన సేవలు మరువలేనివని యూటీఎఫ్ అనుముల మండల అధ్యక్షుడు మన్నెం వెంకటేశ్వర్లు అన్నారు. యూటీఎఫ్ అనుముల మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ హాలియా ప్రధానోపాధ్యాయులు గుండా కృష్ణమూర్తి, టీఎస్ యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి రవీందర్, కోశాధికారి ప్రతాప్, సీనియర్ నాయకులు కోడుమూరు వెంకట్రామ్‌రెడ్డి, బాణాల వెంకటేశ్వర రావు, ప్రశాంత్‌కుమార్, ఎస్ఓ హైమావతి, పద్మ, కల్పలత, గిరిజ, శంకుతల అస్మ, మన్నెం సౌజన్య ఉన్నారు.



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

బూత్ స్థాయి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

దేవరకొండ : పట్టణంలోని సాయిశివ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించనున్న బూత్‌స్థాయి మహాసమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేశ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు గుండాల అంజయ్య, నాయకులు గాజుల మురళి, సొనగంటి రవిప్రసాద్, వస్కుల సుధాకర్, ఇడెం రవి, అర్థం రమేష్, మదుకర్, తదితరులున్నారు

అవార్డు అందుకోవడం హర్షణీయం

దేవరకొండ : సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకొని దేవరకొండ పట్టణానికి 20వ వార్డు కౌన్సిలర్ కొండ్ర మల్లీశ్వరిశ్రీశైలం యాదవ్ ఇటీవల జిల్లా అవార్డు అందుకోవడం హర్షణీయమని దేవరకొండ ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మద్దెలమ్మ దేవాలయ ప్రాంగణంలో యాదవ సంఘం నాయకులు ఆమెను ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, వెంకటేష్‌యాదవ్, వెంకటయ్య, యాదయ్య, మహేశ్ పాల్గన్నారు.



మల్లీశ్వరి శ్రీశైలంను సన్మానిస్తున్న నాయకులు

పేద విద్యార్థినికి ఎంపీ కోమటిరెడ్డి చేయూత



ఎంపీతో విద్యార్థిని సిఫ్రా

మిర్యాలగూడ : పట్టణంలోని 43వ వార్డుకు చెందిన ఆటో డ్రైవర్ కూతురు షేక్ సిఫ్రా ఎంబీబీఎస్‌లో సీటు సాధించగా ఫీజు కట్టలేని విషయాన్ని స్థానిక కౌన్సిలర్ జానీపాషా ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో స్పందించిన ఎంపీ శుక్రవారం విద్యార్థినిక సిఫ్రాకు రూ.60వేల ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచాడు. ఈ సందర్భంగా ఎంపీ కోమటిరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌లో అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేలా కష్టపడాలని విద్యార్థినికి సూచించారు.

ఎస్టీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలి

పెద్దవూర : రెండు సంవత్సరాల కిందట దరఖాస్తు చేసుకున్న గిరిజనులకు కార్పొరేషన్ రుణాలను వెంటనే మంజూరు చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమావత్ సక్రునాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కోమటికుంటతండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపనకు వచ్చిన ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్‌లకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. రాజకీయ వర్గపోరుతో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయడంలో తీవ్ర ఇబ్బందులు ఉన్నాయని అధికారులు దరఖాస్తులను పక్కన పెట్టారన్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి 100యూనిట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమావత్ వాలానాయక్ ఉన్నారు.



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పనులు చేపట్టాలని ఎంఈఓకు వినతి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్యకర్తలు

హాలియా : 'మన ఊరు మన బడి' కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపేట ప్రాథమిక పాఠశాల్లో అసంపూర్తిగా నిలిచిన పనులను వెంటనే చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త లింగాల ప్రభాకర్, కదారి సైదులు శుక్రవారం పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ బాలునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. హాలియా మున్సిపాలిటీ పరిధిలోని మొదటి వార్డు ఇబ్రహీంపేటలో 'మన ఊరు మనబడి' కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల మౌలిక వసతులకు రూ. 23లక్షల మంజూరైనట్లు తెలిపారు. నిధులు మంజూరై 6నెలలవుతున్న పాఠశాల్లో ఇంకా ప్రహరీ, విద్యుత్ పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. పాఠశాలకు వంటగది లేక ఏజెన్సీ నిర్వాహకులు ఆరుబయట వంట చేస్తూ ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి న్యాయం చేయాలి

కొండమల్లేపల్లి : నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్న మల్లికార్జున అనే ఉపాధ్యాయుడికి జరిగిన అన్యాయంపై తగిన న్యాయం చేయాలని ఆలిండియా సమతా సైనిక్ దళ్ జిల్లా ఉపాధ్యక్షులు యేకుల సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 2న కొందరు వ్యక్తులు ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌ను పాఠశాల నుంచి బలవంతంగా బయటికి తీసుకెళ్లి తీవ్రంగా అవమానించారు. ఈ ఘటనపై సదరు ఉపాధ్యాయుడు పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకుండా పోయిందన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకొని ఉపాధ్యాయునికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ జిల్లా నాయకులు ఆడెపు సతీష్, పెరుమాళ్ల వినోద్‌కుమార్, ఆంజనేయులు, సిహెచ్.గోపాల్, పరమేశ్ పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయ వార్షికోత్సవాలు

చింతపల్లి : మండల పరిధిలోని గొడుకొండ్ల గ్రామంలో శ్రీ భవాని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. దీంతో ఆలయంలో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొండూరు శ్రీదేవి, ఆలయ కమిటీ చైర్మన్‌మల్లోజు జగనాచారి, మాస భాస్కర్, కొండూరు శ్రీనివాస్, పూల యాదయ్య, అండేకార్ హరిప్రసాద్, కార్తీక్, వేణు పాల్గొన్నారు.

షీల్డ్‌ల ప్రదానం



షీల్డ్‌లను ప్రదానం చేస్తున్న నాయకులు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని క్రాంతి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షలో డివిజన్ స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు షీల్డ్‌లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సేవానాయక్, నాగేశ్, రాజునాయక్, సురేష్, రమేశ్, సతీష్‌గౌడ్, సందీప్, పాల్గొన్నారు.

విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తున్న యాజమాన్యాలు

మిర్యాలగూడ టౌన్ : ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజుల పేరుతో విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నాయని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ ఆరోపించారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆ ఒత్తిడిని గురిచేయకుండా ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఫీజులు చెల్లించకుంటే పరీక్షలకు హాజరుకానివ్వమని హుకూం జారీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పోటీపడి ఫీజులను పెంచుతున్నారన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ అజయ్‌కుమార్, శ్రీను, గంగాధర్ పాల్గొన్నారు.